క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



రైతు వేదికలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గూడూరు : ఎరువులు, విత్తన విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ అన్నారు. గురువారం వద్దెరగూడెం రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఎండీ అబ్దుల్‌మాలిక్ ఆధ్వర్యంలో మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించే షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించాలన్నారు. సాంకేతిక వ్యవసాయ అ ధికారి రాజు, ఏఈఓలు, డీలర్‌లు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న డీఆర్పీ లింగమూర్తి

దంతాలపల్లి : శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు ప్రతి అంశాన్ని క్షుణంగా అధ్యాయనం చేయాలని జిల్లా పరిశీలకులు (డీఆర్పీ) లింగమూర్తి అన్నారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ఉపాధ్యాయుల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వెనకబాటుపై దృష్టి సారించి వారు అభివృద్ధి చెందే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. శిక్షణ తరగతులకు 65 మంది ఉపాధ్యాయులు, 8 మంది ఎమ్మార్పీలు పాల్గొన్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి, పీఆర్పీలు పాల్గొన్నారు.

'తిరంగా' యాత్ర



గూడూరు/దంతాలపల్లి : ఆపరేషన్ సిందూర్‌లో జవాన్ల విజయాన్ని కీర్తిస్తూ సైనిక వందనం సమితి ఆధ్వర్యంలో మనం సైతం దేశం కోసం అంటూ గూడూరు మండల కేంద్రంతో పాటు దంతాలపల్లిలో గురువారం భారీ తిరంగా యాత్ర నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో రిటైర్డ్ జవాన్ సాంబయ్య, సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సైనిక వందన సమితి ప్రతినిధులు పింగిళి శ్రీనివాస్, రాసమల్ల యాదగిరి, నరేష్‌శాస్త్రి పాల్గొన్నారు.

జీఓ 2ను రద్దు చేయాలి

గూడూరు : ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అడ్డుగా ఉన్న జీఓ నంబర్ 2ను వెంటనే రద్దు చేయాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ పలు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హక్కుల సాధనకు కలిసి పోరాడుదామని, అంబేడ్కర్ ఆలోచన విధానం భవిష్యత్ తరాలకు అందజేద్దామంటూ ముద్రించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. నాయకులు మోకాళ్ల వెంకన్న, మేడ వసంత, వినయ్‌కుమార్, లక్ష్మయ్య, పగడయ్య, ప్రభాకర్, ఆదినారాయణ, లావణ్య, యశోద, సారమ్మ, సుభద్ర, రాజేశ్వరి, శ్రీకళ, సునీత, విజయ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆలయ ఉద్యోగి మృతి



రవి (ఫైల్)

కురవి : మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోలోజు రవి(51) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. వరంగల్‌లోని ఉర్సు ప్రాంతానికి చెందిన రవి వీరభద్రస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆలయం పక్కనే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఉదయం స్నానం చేసేందుకు వెళ్లగా ఇంట్లోకి కోతులు వస్తాయని తలుపు గడియ పెట్టుకున్నాడు. ఈక్రమంలో గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. ఆలయంలో పనిచేసే మంజుల అనే ఉద్యోగి రవి ఇంటికి వెళ్లి సార్..సార్ అని పిలవగా తలుపు తీయక పోవడంతో నెట్టింది. తలుపు తీయకపోవడంతో పక్కన ఉన్న వారికి చెప్పగా గట్టిగా నెట్టడంతో లోపల గడియ ఊసి వచ్చింది. రవి ఇంట్లో కిందపడి ఉండడంతో వెంటనే ఆలయ సిబ్బంది అంబులెన్స్‌లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే రవి మృతి చెందినట్లు తెలిపారు. రవి మృతిని తెలుసుకున్న ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్త బాలగాని శ్రీనివాస్‌లు ఆస్పత్రికి వెళ్లి రవి మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. కాళేశ్వరం విధుల్లో ఉన్న ఆలయ ఈఓ సత్యనారాయణ వరంగల్‌లోని రవి ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఎత్తిపోతల మోటార్లు మాయం

- నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే చోరీ

డోర్నకల్ : డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకానికి చెందిన రెండు విద్యుత్ మోటార్లు మాయమయ్యాయి. మున్నేరు నుంచి బతుకమ్మ చెరువుకు నీటిని తరలించేందుకు 2012లో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని బతుకమ్మ చెరువుకు నీటిని తరలించేందుకు రూ.1.53 లక్షల నిధులతో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి 200 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ కోసం మున్నేరు వాగు వద్ద షెడ్డు ఏర్పాటు చేసి రెండు 20 హెచ్‌పీ సామర్థ్యంగల విద్యుత్ మోటార్లు, వాక్యూమ్ పంప్, మరో 3 హెచ్‌పీ మోటర్‌తో పాటు రెండు స్టార్టర్లతో కూడిన ప్యానల్ బోర్డును ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పాటు లిఫ్ట్ ద్వారా చెరువుకు నీటిని



షెడ్డును పరిశీలిస్తున్న డీఈ భద్రునాయక్

తరలించిన అనంతరం విద్యుత్ బిల్లుల వ్యయంతో పాటు ఇతర కారణాలతో లిఫ్ట్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. లిఫ్ట్‌ను పట్టించుకోకపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాలతో పాటు షెడ్డులోని విద్యుత్ మోటార్ చోరీకి గురయింది. ఇటీవల 20హెచ్‌పీ మోటార్ సైతం చోరీకి గురైంది. ప్రస్తుతం రక్షణ లేని షెడ్డులో మరో 20 హెచ్‌పీ విద్యుత్ మోటార్ మాత్రమే ఉంది. రూ.కోటి పైగా వ్యయంతో నిర్మించిన లిఫ్ట్‌ను నిర్లక్ష్యంగా వదిలేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ధ్వంసమైన ప్యానల్ బోర్డు

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం..

విద్యుత్ మోటార్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఇరిగేషన్ డీఈ భద్రునాయక్ తెలిపారు. మున్నేరువాగు వద్ద లిఫ్ట్ షెడ్డును పరిశీలించిన డీఈ రెండు విద్యుత్ మోటర్లు చోరీకి గురైనట్లు తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

కేసముద్రం : అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి, ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని, అదే విధంగా గన్నీసంచులను వెంటనే అందించాలని మండలంలోని కల్వల ధాన్యం కొనుగోలు కేంద్రం ఎదుట ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో రైతులు గురువారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై మురళీధర్‌రాజు ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచులు ఇవ్వలేదని, ధాన్యాన్ని, మిల్లులకు రవాణా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామంటూ ఎస్సై, డీటీ ఎర్రయ్య ఆందోళనకారులకు నచ్చ చెప్పడంతో శాంతించారు. ఆ తర్వాత రైతులకు గన్నీ సంచులను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గొడిశాల వెంకన్న, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, తాడబోయిన శ్రీశైలం, నీరుటి జలేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: కల్వలలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

అధికారుల నిర్లక్ష్యం..ఎక్కడి ధాన్యం అక్కడే

నెల్లికుదురు : అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎక్కడికక్కడే పేరుకుపోయి రైతులు అవస్థలు పడుతున్నారని అఖిల భారత రైతు కూలీసంఘం జిల్లా నాయకుడు ఆలకుట్ల సాయన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యంతో పడిగాపులు కాస్తున్నారని, గాలివానలకు ధాన్యాన్ని కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం కాంటాలు నిర్వహించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసి త్వరగా కాంటాలు చేయాలన్నారు. ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని, రైతుల ఖాతాల్లో బోనస్‌తో పాటు డబ్బులు వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు.

పాతవాహన భాగాలు వేలం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఆర్‌ఐ స్టోర్స్, ఆర్‌ఏ మెకానికల్ విభాగం వద్ద పాత వాహనాల భాగాలు, ఇతర పరికరాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని ఆర్‌ఐ విభాగం వద్ద వేలం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 99639 66516, 99122 86084 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



తొర్రూరు రూరల్ : మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన బత్తుల సతీష్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి సతీష్ స్నేహితులు రూ.35వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు వినయ్, కుమారస్వామి, అశోక్, సైదులు, యాకయ్య, ప్రవీణ్, క్రాంతికుమార్, సుమన్, వెంకన్న పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



మహబూబాబాద్ రూరల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీని కొత్తగూడెం స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు న్యాయవాదులు శెట్టిపల్లి వెంకటరామారావు, బి.చిరంజీవరావు, జీవీ.హరిప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ నూతన కమిటీ నియామకం

తొర్రూరు : బీజేపీ తొర్రూరు అర్బన్ మండల కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. అధ్యక్షుడిగా పైండ్ల రాజేష్, ఉపాధ్యక్షులుగా గట్ల భరత్, జలగం రవీందర్, నర్కుటి చలపతిరాజ్, మూల శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా పప్పుశెట్టి సంతోష్, నడిగడ్డ సందీప్, కార్యదర్శులుగా తాటి జగదీష్, బొమ్మరాతి రాజకుమార్, గంధం శ్యామల, నర

కార్మిక హక్కుల కోసం ఉద్యమించాలి

గూడూరు : వ్యవసాయ, ఉపాధి హామీ, ఇతర రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ)తో సంఘటితమై ఉద్యమించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న పిలుపునిచ్చారు. మండలంలోని రాజనపల్లిలో గురువారం సంఘం ప్రథమ మండల మహాసభ చెరుకు రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ, ఇతర కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీకేఎంయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ధర్మారపు సంపత్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి చెరకు రవీందర్, ముయ్యబోయిన సాంబయ్య, మహేష్, లక్ష్మయ్య, చెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకన్న

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

మరిపెడ/మరిపెడ రూరల్ : రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారి బోడ వీరాసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం వద్ద రైతులతో కలిసి విత్తనాలు ప్రదర్శించారు. ఏడీ విజయ్‌చంద్రతో కలిసి ఏఓ మాట్లాడుతూ మండలానికి జీలుగ 750, జనుము 40 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జీలుగ 30 కిలోల బస్తాకు రూ.2,137, జనుము 40 కిలోల బస్తాకు రూ.2,510 చొప్పున రైతు చెల్లించి విత్తనాలు పొందాలన్నారు.ఒక్కో బస్తా రెండున్నర ఎకరాలు సాగు చేసుకోవచ్చునని, అందుకు రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి రాయితీ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కాలం శ్రీనివాస్‌రెడ్డి, నలబోలు ప్రవీణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వీరాసింగ్

హామీలు నెరవేర్చాలి

కేసముద్రం : ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు చాగంటి కిషన్ గురువారం డిమాండ్ చేశారు.



హోమం చేస్తున్న సీతారాంరెడ్డి, హమేంద్రాదేవి



నర్సింహులపేట: వేడుకలో పాల్గొన్న భక్తులు



బయ్యారం: అన్నం వడ్డిస్తున్న మంత్రి పొంగులేటి

హనుమాన్ జయంతి వేడుకలు

జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతిని గురువారం మాలాధారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయస్వామి విగ్రహానికి చందనాభిషేకం, చాలీసా పారాయణం, దండకం, హోమ పూజలు చేశారు. పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. మహిళా భక్తులు కోలాటాలు వేస్తూ నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదానాలు చేపట్టారు. మాలలు ధరించిన స్వాములు ఇరుముడులతో కొండగట్టుకు తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: హనుమాన్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు, అర్చకులు



గూడూరు: హనుమాన్ ఆలయం వద్ద..



మరిపెడ: రామాలయంలో బారులుదీరిన భక్తులు



మానుకోట శ్రీరామ ఆలయంలో..



గార్ల: ఆంజనేయస్వామి దేవాలయంలో..



కేసముద్రం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నెల్లికుదురు హనుమంతుని గద్దలో..

సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలి

నెహ్రూసెంటర్ : మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 30 మంది ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌తో హత్యలు చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సమ్మెట రాజమౌళి, రాంమూర్తి, హేమానాయక్, బిల్లకంటి సూర్యం, ముంజంపల్లి వీరన్న, రామచంద్ర, బందారి ఐలయ్య, మోకాళ్ల మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, పద్మ, సత్యనారాయణ, హలావత్ లింగ్యా, దేవేందర్, శివ్వారపు శ్రీధర్, చైతన్యం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మావోయిస్టులపై దాడులు ఆపాలి

కురవి : మావోయిస్టులపై మిలిటరీ దాడులను వెంటనే ఆపాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్ : పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను ప్రాతిపదికగా తీసుకుని పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వెంకన్న, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, సత్యనారాయణ, హలావత్ లింగ్యా, దేవేందర్, శ్రీధర్, సక్రు, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

కూటి శివ, గణేష్, కోశాధికారిగా తూరాపటి లక్ష్మీతోపాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ కమిటీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి ప్రకటించారు.

సర్వీసు మంజూరుకు సింగిల్‌విండో విధానం

నెహ్రూసెంటర్ : విద్యుత్ వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఓల్టేజీ సర్వీసులు మంజూరు వేగవంతం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టినట్లు విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఈ జె.నరేష్ గురువారం తెలిపారు. హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఓల్టేజీ సర్వీసులు మంజూరుకు మరింత వేగవంతం చేసేలా మానిటర్ సెల్‌ను సర్కిల్ కార్యాలయం, కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

గార్ల : పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గురువారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. పాకాల ఏటి వరద ఉధృతికి మండలంలోని 20 గ్రామాల ప్రజలు గార్లకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి విన్నవించారు. మీ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రావూరి వెంకట్రామయ్య, మాజీ జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ తదితరులు ఉన్నారు.

స్థల పరిశీలన

నర్సింహులపేట : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటునకు గురువారం పంచాయతీ రాజ్ ఎస్‌ఈ మంగ్యానాయక్ స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.1.46 కోట్లు నిధులు మంజూరు కావడంతో స్థల పరిశీలన చేశామని, త్వరలో నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. ఈఈ విద్యాసాగర్, డీఈ నర్సింగ్‌నాయక్, ఏఈ సుగుణాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

డోర్నకల్ : స్థానిక డీడీ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 39 విద్యార్థులు హాజరయ్యారు.

ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నెహ్రూసెంటర్ : ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని విభాగాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలకు కేటాయించిన రోస్టర్, రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షురాలు ఎండీ రజియా, పాలెపాక ప్రవీణ్, చలగోల వెంకన్న, కందిపాటి భిక్షపతి, ఎండి.పాష, కొమ్ము నాగరాజు, ప్రశాంత్, బోడ సుమిత్ర, రామరాజు పద్మ, ఇరుగు వెంకటమ్మ, సమ్మయ్య పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

డోర్నకల్ : డోర్నకల్ సమీపంలో కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన ఓ కుటుంబం కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లి బుధవారం అర్ధరాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. డోర్నకల్ సమీపంలోని లచ్చాతండా దాటుతున్న క్రమంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఒకరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని తెలిసింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



భద్రు (ఫైల్)

గూడూరు : రెండ్రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలిన సంఘటన మండలంలోని గుండెంగ శివారు పంతుల్యా తండాలో గురువారం చోటుచేసుకుంది. తేజావత్ భద్రు (40) మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని బుధవారం అతడి భార్య నీల పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అనంతరం భద్రు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, తండావాసులు వెతుకుతుండగా గురువారం పంతుల్యా తండా సమీపంలో చెన్నారావుపేట మండల పరిధిలోని ఓ రైతు వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న గూడూరు సీఐ జి. సూర్యప్రకాశ్, ఎస్సై గిరిధర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీయించారు. అయితే భద్రు మృతిపై కుటుంబ సభ్యులు, తండావాసులు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేశారు. భద్రు మృతిని హత్యగా గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఉరేసుకొని వధువు ఆత్మహత్య



మహేశ్వరి (ఫైల్)

దంతాలపల్లి : ఉరేసుకొని వధువు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన గొడిశాల మహేశ్వరి (19)కి ఈనెల 8వ తేదీన సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన వినయ్‌తో వివాహం జరిగింది. ఈక్రమంలో ఇటీవల ఆమె తన తల్లిగారి ఇంటికి వచ్చింది. ఛాతి నొప్పి భరించలేక గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి

క్రైం కార్నర్

తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. మహిళలకు గాయాలు

మహబూబాబాద్ రూరల్ : లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరు మహిళలకు గాయాలైన సంఘటన అనంతారం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రామ్ కాలనీ చెందిన ఇరుగు రుద్రమ్మ, ధర్మారపు రాధమ్మ మిర్చి తొడిమెలు తీసేందుకు ఓ ఆటోలో వెళ్లి అనంతారం శివారులో దిగారు. ఆటో డ్రైవర్‌కు డబ్బులు ఇస్తున్న క్రమంలో ఆ ఆటో వెనుకాల ఓ కారు వచ్చి ఆగగా దాని వెనకాలే ఓ లారీ వచ్చి ఆ కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో రుద్రమ్మ, రాధమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. రుద్రమ్మ భర్త ఇరుగు భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మందుల కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక పేర్కొన్నారు.

గేదెలను ఢీకొన్న ఆటో..

కురవి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి గేదెలను ఆటో ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కురవి నుంచి మరిపెడకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత ఎదురుగా రోడ్డుపై గేదెలు వస్తుండడంతో ఒక్కసారిగా ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగారంకు చెందిన రంజిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం అతడిని మానుకోటలోని ఆస్పత్రికి తరలించారు.